కామెడీ కథ

**"గోపాలం వచ్చేస్తున్నాడు హో..హో..హో.." టముకు వేసి చెప్పిన లెవెల్లో స్పెషలెఫెక్ట్ సౌండిచ్చి అనౌన్స్ చేసాడు ప్యూన్ పూర్వానందం.**

**వితిన్ సెకన్స్‌లో ఆఫీసు అట్మాస్ఫియర్ కర్నాటక అడవుల్లో వీరప్పన్‌ని పట్టుకోవడానికి తమిళనాడు, కర్నాటక పోలీసులు మోహరించిన రేంజ్‌లోకి షిఫ్టయిపోయింది.**

# గోపాలానికి బుద్ధొచ్చింది

మగ స్టాఫ్ జెలసీగా, ఆడ లేడీ స్టాఫ్ అడ్మియరింగ్‌గా గోపాలం రాకకోసం ఎదురుచూడసాగారు. గోపాలం అంటే స్టాఫ్‌లో వున్న ఫీలింగలాంటిది మరి. థర్టీప్లస్ అయినా ఎప్పుడూ టిప్‌టాప్‌గా వుంటాడు. బాడీలో నాలుగైదు రకాల స్ప్రేలు మిక్సయిపోతాయి. జీతంకన్నా, గీతం ఎక్కువ వచ్చే పోస్టులో వుండడం అతనికి ప్లస్ పాయింట్.

యాచకో యాచకః శత్రు...అన్న లెవెల్లో అతనికి ఆఫీ నలో పన్జేసే మగస్టాఫ్ అంటే ఎలర్జీ. ఆడ లేడీస్టాఫ్ మీద తెగ సాఫ్ట్ కార్నర్ చూపించేస్తాడు. టైపిస్ట్ సుందరి అలా అలవోకగా చూసీ చూడగానే, "ఏంటీ..మంత్లెండింగ్ కదా..మనీ ప్రాబ్లెమా.." అని అడగకపోయినా పర్సులో మంచి వంద కాగితాలు తీసిస్తాడు.

డిస్పాచ్ సెక్షన్ ధీరజ కనిపించగానే, "అరె..అలా చిక్కిపోయారేమిటి..అలా క్యాంటీన్‌కు..వద్దొద్దు..కామత్‌కు వెళ్ళి పెసరట్టు, ఉప్మా తినొద్దాం రండి" అని ఇన్వయిట్ చేస్తాడు. కొందరతడిని మదనగోపాలం అని, యింకొందరు గోపాలకృష్ణుడని, మరికొందరు మదన మన్మథ గోపాలకృష్ణుడని పిలుస్తుంటారు. ఈ విషయంలో ఆఫీసులో మగజెంట్సే కాదు..యింట్లో వోన్ వైఫ్ కూడా అతనికి ఎనిమీనే.

★ ★ ★

పెళ్ళయి ఆరేళ్ళయినా ఆవగింజంత ఛేంజ్ కూడా లేదు గోపాలంలో.

అప్పుడప్పుడు అమ్మాయిలను యింటికి తీసుకురావడం...

"మీట్ మై గాళ్ ఫ్రెండ్ లత.." అని పరిచయం చేయడం అతనికి షరా మామూలే.

"హేవండీ..మీరు శ్రీరాముడిలా ఏకపత్నీ వ్రతుడిలా వుండాలని" మిసెస్ గోపాలం సెంటిమెంట్ సీనొకటి ప్లే చేస్తే..."ఠాఁ...అవన్నీ నా బాడీకి వర్కవుట్ అవ్వవు. పుట్టుకతో వచ్చిన బుద్ధి...'లేట్' గోపాలం అయ్యేవరకూ పోదు" అని స్టేట్‌మెంటొకటి యిచ్చి, సదరు భార్యకు మెంటలెక్కించాడు.

దీనికి తోడు అర్ధరాత్రుళ్ళు, అపరాత్రుళ్లు, లిల్లీ అనో, స్టెల్లా అనో, మీరా అనో, సువర్ణ, రేణుక... యిలా 'స్త్రీలింగాలను' పలవరించడం అతని రొటీన్ ప్రోగ్రామ్...తెల్లారి లేపి అడిగినా, రాత్రికి రాత్రే దులిపేసి అడిగినా,

"అవునా..కలవరించానా? ప్చ్.." అంటాడే తప్ప, తన చపలత్వాన్ని విడిచిపెట్టడు. దటీజ్ గోపాలం.

అలాంటి గోపాలానికి కష్టకాలం దాపురించింది ఓ ఫైన్ ఈవినింగ్.

★ ★ ★

'జోరుగా హుషారుగా ఎఫ్ టి.వి. చూద్దామా' అని తన స్టయిల్‌లో పాట హమ్ చేస్తూ లోపలికి అడుగుపెట్టాడు. సడన్‌గా అతని కుడికాలు అదిరింది. అదేం సింప్టమో అర్థం కాలేదు. కానీ దాని తాలూకు రిజల్ట్ వితిన్ సెకన్స్‌లో తెలిసింది.గోపాలాన్ని చూసిన మిసెస్ గోపాలం కళ్లు ఆల్చిప్పల్లా చేసుకొని "హ..న్న..య్యా.." అని పిలిచింది.

అంతే, ఒక్కక్షణం విరుచుకుపడబోయి, తమాయించుకొని

"ఒసే....నేను నీ మొగుడ్ని" అన్నాడు కీచుగొంతుతో గోపాలం.

వెంటనే ఫట్..ఫట్ మంటూ గోపాలం రెండు చెంపలను నాగపూర్ బూరెల్లా వాయించి, "తప్పన్నయ్యా! మనిద్దరం అన్నా చెల్లెళ్ళం. నువ్వు రక్తసంబంధంలో ఎన్టీఆర్‌వి అయితే, నేను షకీలాని" అంది.

సీలింగ్ ఫ్యాన్ నెత్తిమీద పడ్డ ఫీలింగ్ కలిగింది.

"రక్తసంబంధంలో ఎన్టీఆర్ చెల్లెలు షకీలా ఏంటే...నా ఖర్మకాకపోతే..." నెత్తీనోరూ బాదుకొని అన్నాడు.

"అవునుగానీ, ఒరే అన్నయ్యా..అమ్మ, నాన్నా బావున్నారా? మా ఆయన నన్ను కాపురానికి తీసుకెళ్తానన్నాడా? శోభనానికి ముహూర్తం పెట్టిస్తానన్నాడా..అబ్బో నాకు తెగ సిగ్గేస్తుందన్నయ్యా.." అంది రెండు చేతులను తలమీద పెట్టుకొని.

"నీకు శోభనం ఏమిటే..మనం ఆరేళ్ళుగా కాపురం చేస్తుంటే.." మరోసారి తలబాదుకుని అరిచాడు.

★ ★ ★

ఆ రాత్రంతా కంటిమీద కునుకు లేదు గోపాలానికి.

అన్నం వడ్డించమంటే, "ఇప్పుడే పీకల్దాకా మెక్కారు కదా.." అంటుంది. కాఫీ తెచ్చిపెట్టమంటే, ఫినాయిల్‌లో కాఫీ పొడి కలిపి తెచ్చిచ్చింది.

★ ★ ★

పొద్దున్నే నిద్రలేచిన గోపాలానికి లెఫ్ట్‌లెగ్ అదిరిన ఫీలింగ్ కలిగింది. ఆ ఫీలింగ్‌కు రియాక్షన్ వెంటనే స్క్రీన్ మీద కనిపించిన రేంజ్‌లో ఎదురైంది.

పాలబ్బాయ్ డోర్‌బెల్ అదేపనిగా మోగిస్తుంటే, మిసెస్ గోపాలం తలుపు తీసింది.

"మేడమ్ మిల్క్ ప్యాకెట్.." పాలబ్బాయి చెప్పాడు. అతని వయసు పదహారు, పద్దెనిమిది మధ్య వుంటుంది.

మిసెస్ గోపాలం కళ్లు మిటకరించి పాలబ్బాయి వైపు చూసి-

"బావా..నువ్వా..రారా..ఎప్పుడొచ్చావ్.." అంటూ పాలబ్బాయి చేతిని పట్టుకుని లోపలికి లాక్కొచ్చింది.

పాలబ్బాయి అదిరిపడ్డాడు. "వెళ్ళనా..వద్దా.." అని అదేదో 'యాడ్'లో వచ్చినట్టు సంశయిస్తూ వుండిపోయాడు. ఈ దృశ్యం గోపాలం చూడనే చూసాడు.

"ఒ...సే..." అంటూ రెండు అక్షరాలకు దాదాపు పది నిమిషాలు గ్యాపిచ్చి అరిచాడు. ఆ అరుపునకు పాలబ్బాయ్ బెదిరిపోయాడు.

"ఒసే..వాడు నీ బావేమిటి..నిండా పదహారేళ్ళు లేవు, యింకా మీసాలే సరిగ్గా రాలేదు..వాడు పాలబ్బాయే..." అన్నాడు మరోసారి నెత్తీనోరూ కొట్టుకుంటూ.

★ ★ ★

గోపాలానికి ఆఫీసుకి వెళ్లాలన్నా భయంగానే వుంది. తనటు వెళ్లగానే ఏ పోస్ట్‌మాన్‌నో, 'హేవండీ' అని డైరెక్ట్‌గా బెడ్రూంలోకి తీసుకెళ్తుందేమోనన్న డౌట్ పీకుతోంది. అప్పుడు గుర్తొచ్చాడు మహంతి. గోపాలానికి స్వయాన బావమరిది. మిసెస్ గోపాలానికి అన్నయ్య. అతను సైకియాట్రిస్టు కూడా. వెంటనే భార్యను మహంతి దగ్గరకి తీసుకెళ్లాలనే స్ట్రాంగ్ డెసిషన్‌కు వచ్చాడు.


★ ★ ★

మహంతిని చూడగానే "తాతయ్యా" అంటూ ఎదురెళ్లి, వాటేసుకుంది. గోపాలం వెక్కివెక్కి ఏడుస్తూ ఒక్కో విషయాన్ని పోజిచ్చి మరీ చెప్పాడు.

చాలా సీరియస్‌గా ఫేస్‌పెట్టి సీలింగ్ ఫ్యాన్ వంక చూసి, ఆ తర్వాత అయిదారుసార్లు నిట్టూర్చి, మళ్లీ సీలింగ్ ఫ్యాన్ వంక చూసి మళ్లీ నిట్టూర్చి...

"బా..వా.. నువ్వలా ఏదో పదే పదే సీలింగ్ ఫ్యాన్ వంక చూసి నిట్టూరుస్తూ వుంటే నాకు మెంటలెక్కుతోంది. అసలు విషయం ఏమిటో చెప్పు" గట్టిగా అరిచి అడిగాడు గోపాలం.

"సారీ బావా సారీ... సారీ బావా సారీ.. సారీ బావా సారీ..."




"ఆపేయ్... తెలుగు టీవీ సీరియల్ టైప్‌లో మూడేసి సార్లు చెప్పకు..." జుట్టు పీక్కుంటూ అన్నాడు గోపాలం.

మహంతి చెప్పడం మొదలుపెట్టాడు. "చెల్లాయ్ బాగా డిస్టర్బ్ అయింది. ఏదో విషయంలో బాగా విసిగిపోయింది. దాంతో 'అల్జీమర్స్' వచ్చేసింది" చెప్పాడు ఈసారి ఎయిర్ కూలర్ వంక చూస్తూ.

"అల్జీమర్స్... అంటే క్యాన్సర్‌కు కజినా? బ్రెయిన్ ట్యూమర్‌కు రిలేషనా?" అడిగాడు గోపాలం.

"ఆ రెండూ కాదు, నీ కొంప కూల్చే డామేజర్. మెదడులోని కొన్ని కీలక భాగాలు దెబ్బ తినడం వల్ల సంక్రమించే మతిమరపు వ్యాధి అల్జీమర్స్... జ్ఞాపకశక్తి కోల్పోవడం, కుటుంబ సభ్యులను సైతం గుర్తించలేకపోవడం ఈ వ్యాధి లక్షణం. ప్చ్... నీ లైఫ్ గాన్ విత్ ద విండ్ అనుకున్నాను. గాన్ విత్ ద మున్సిపాల్టీ చెత్తకుండీ అవుతుందనుకోలేదు బావా. నువ్వు జాగ్రత్తగా చెల్లాయిని కనిపెట్టుకు వుండకపోతే, నువ్వు తెలిసి చేసే వెధవ పనులు, చెల్లాయ్ తెలియకుండా, మతిమరపు వల్ల చేయొచ్చు. తర్వాత నీ కొంప, భూత్‌బంగ్లా మిస్టరీ అవుతుంది. దీనికి నో మందులు." ఈసారి గోపాలం మొహం వంక చూసి చెప్పాడు మహంతి.

సరిగ్గా అప్పుడే మిసెస్ గోపాలం, ఆ ఆసుపత్రి బోయ్‌ని బలవంతంగా లాక్కొచ్చి, గోపాలం వంక చూసి "అన్నయ్యా, ఈయనే నాక్కాబోయే శ్రీవారు. మమ్మల్ని ఆశీర్వదించండి" అంటూ కాళ్ల మీద పడబోయింది. కానీ అప్పటికే గోపాలం విరుచుకుపడి మిసెస్ గోపాలం కాళ్ల మీద పడిపోయాడు.

★ ★ ★

ఒకట్రెండు... మూడ్నాలుగు... అయిదారు...

ప్చ్... వారం రోజులు గడిచిపోయాయి. గోపాలం షేవింగ్ చేస్కోవడం కూడా మానేసాడు. ఎక్కడికెళ్లాలన్నా భయమే. భార్య ఏ క్షణం ఏం చేస్తుందో తెలియదు. పాలవాడిని 'బావా' అంటుంది. కూరగాయలవాడిని 'ఏమండీ' అంటుంది. వాచ్‌మేన్‌ని బావగారూ... బావున్నారా అని పలకరిస్తుంది. ఓరోజు పక్కింటి పదేళ్ల టింకుని తీసుకుని 'ఈయనే మావారు' అని పరిచయం చేసింది గోపాలానికి.

★ ★ ★

తన తిరుగుళ్లు... ప్లస్ చెడు తిరుగుళ్లు మానేసాడు. రోజూ వందసార్లయినా నేన్నీ భర్తనని భార్యకు గుర్తు చేస్తూ వున్నాడు. అది కన్‌ఫర్మ్ చేయడానికి భార్యను సినిమాలకు తీసుకువెళుతున్నాడు. పార్కులకు, షికార్లకు తీసుకువెళ్తున్నాడు.

★ ★ ★

పది... పదిహేను... ఇరవై... ముప్పయి...

నెల గడిచింది. మిసెస్ గోపాలం దారి లోకి వస్తోంది. మహంతి చెప్పాడు. "నీ శ్రమ ఫలించబోతోంది. ఇలానే చెల్లెమ్మను కనిపెట్టుకు వుంటే అనుక్షణం ఇలా ప్రేమగా చూస్తూ, నువ్వు తన భర్తవనే విషయం గుర్తు చేస్తూ వుంటే ఫలితం వుంటుంది" చెప్పాడు చంకలు గుద్దుకుంటూ.

★ ★ ★

ఇప్పుడు గోపాలానికి భార్యే ప్రపంచం. రెండు నెలల తర్వాత నెల తప్పింది మిసెస్ గోపాలం. ఇప్పుడు భర్తను బాగానే గుర్తుపడుతోంది. గోపాలం మాత్రం పరాయి స్త్రీని గానీ, పాత గాళ్‌ఫ్రెండ్స్ కానీ కనిపించినా, కనిపించనట్టే, అసలు గుర్తుపట్టనట్టే తప్పుకు తిరుగుతూ బుద్ధిగా పెళ్లాన్నితో కాపురం చేస్తున్నాడు. లేకపోతే తన కొంప కొలంబో అవుతుందన్న భయం పట్టుకుంది.

★ ★ ★

ఓరోజు సాయంత్రం మహంతికి ఫోన్ చేసి- "థాంక్స్‌రా అన్నయ్యా... మీ బావకు బుద్ధి చెప్పడానికి మనం ఆడిన 'అల్జీమర్స్' డ్రామా సూపర్ హిట్టయింది. 'థాంక్స్ టు అల్జీమర్స్'. ఇప్పుడాయన బుద్ధిగానే వుంటున్నారు" అన్జెప్పింది మిసెస్ గోపాలం. ఈ సంగతి గోపాలానికి ఎప్పుడూ తెలిసే అవకాశం లేదు.

ఇలాంటి సందర్భాల్లోనే 'మరుపు' ఒక గొప్ప వరమని ప్రూవ్ అవుతుందేమో! ✤

ముచ్చర్ల రజనీశకుంతల